ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- ఆర్బీకేల్లో అందుబాటులో నాణ్యమైన ఎరువులు
- సబ్సిడీపై విత్తన వేరుశనగ పంపిణీ
- ప్రత్యామ్నాయ విత్తనాలు అందజేసేందుకు ప్రణాళికల తయారీ

గార్లదిన్నె: తొలకరి వర్షం పలకరించింది. రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లో సాగు సందడి కనిపిస్తోంది. రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు మండలాల్లో ఇప్పటికే ఆర్బీకే కేంద్రాల్లో రైతులకు 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం వేరుశనగ విత్తనకాయలు, ఎరువుల పంపిణీకి చర్యలు తీసుకుంది. నియోజకవర్గంలో 5,263 ఎకరాల సాగు భూమి ఉంది. వేరుశనగ విత్తన కాయలు ఒక క్వింటా పూర్తి ధర రూ.9,500 కాగా.. సబ్సిడీ రూ.3,800 అందిస్తోంది. ఒక్క వేరుశనగ బ్యాగ్ పూర్తి ధర రూ.2,850 కాగా.. సబ్సిడీ రూ.1,140 పోగా.. రైతు రూ.1,710 చెల్లించాలి. ఒక్క రైతుకు ఎకరాకు గరిష్టంగా 3 బస్తాలు పంపిణీ చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులతో పాటు కౌలు రైతులకు సమానంగా అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. భూ యజమాని అంగీకారంతో కౌలు రైతులకు కౌలు హక్కుదారు పత్రాలు అందించి పంటల సాగుకు ప్రభుత్వం సహకరిస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ బీమా కూడా వర్తింపు చేస్తోంది. ధాన్యం అమ్మకాలు, సున్నావడ్డీ, పంటల బీమా తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేసింది.


గార్లదిన్నెలో సబ్సిడీ వేరుశనగ కాయల నాణ్యత పరిశీలిస్తున్న ఏడీ రవి (ఫైల్)

విత్తనకాయల పంపిణీ ఇలా..

గార్లదిన్నె మండలంలో 14 ఆర్బీకే కేంద్రాల్లో 1,400 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. ఇప్పటి వరకు 1,374 క్వింటాళ్ల వేరుశనగ కాయలను రైతులు కొనుగోలు చేశారు. బుక్కరాయసముద్రం మండలంలోని 14 ఆర్బీకే కేంద్రాలకు 2,200 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. ఇప్పటికే 2,250 మంది రైతులు సబ్సిడీ విత్తనకాయలు తీసుకున్నారు. పుట్లూరు మండలానికి 100 క్వింటాళ్లు కేటాయించగా.. 57 మంది రైతులు 50 క్వింటాళ్ల వేరుశనగ కాయలు కొనుగోలు చేశారు.

ఆర్బీకేల్లో రైతులకు సత్వర సేవలు

ఆర్బీకేల్లో విత్తనం కొనుగోలు నుంచి, పంట దిగుబడి, పంట విక్రయం వరకు ఆర్బీ కేంద్రాలు రైతు నేస్తాలుగా ఉన్నాయి. పంటల సాగులో సలహాలు, సూచనలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు ఆర్బీకే కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్బీకేల ఏర్పాటుతో రైతులకు ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రస్తుతం 28 రకాల సేవలు రైతులకు అందుతున్నాయి. పశుసంవర్ధక శాఖ ద్వారా 11, మత్స్యశాఖ నుంచి 6, పట్టు పరిశ్రమ ద్వారా మిగతా సేవలను రైతులు పొందుతున్నారు. వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక రకాల రాయితీ పనిముట్లు అందిస్తోంది. ప్రకృతీ వైపరీత్యాల వల్ల పంటల నష్టపరిహారానికి సంబంధించి అర్హుల జాబితా తయారు చేస్తారు.

ఆర్బీకేలతో మేలు



రైతు భరోసా కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. గతంలో విత్తన కాయలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వెళ్లి రోజంతా క్యూలో వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. విత్తనకాయలు, ఎరువులు గ్రామాల్లోని ఆర్బీకేల్లో అందజేస్తున్నారు. అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు.

– వెంకటశివారెడ్డి, తిమ్మంపేట, గార్లదిన్నె మండలం

వేరుశనగ తీసుకెళ్లండి



ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు సిద్ధంగా ఉంచాం. 40 శాతం సబ్సిడీతో రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్నాం. ఏ రైతు గ్రామం నుంచి బయటకు వెళ్లి విత్తన కాయలు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. ఆర్బీకేల్లోనే విత్తనాల పంపిణీతో పాటు పంట కొనుగోలు చేస్తాం.

– సోమశేఖర్, ఏఓ, గార్లదిన్నె

క్లుప్తంగా

పుస్తకాలు వచ్చేశాయ్..


నోట్‌పుస్తకాలను ఎమ్మార్సీలో భద్రపరిచిన దృశ్యం

యల్లనూరు: మండల వ్యాప్తంగా 38 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2,458 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు ఎంఈఓ–1 చంద్రశేఖర్, ఎంఈఓ–2 పరమేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. ఒకటవ తరగతి నుంచి 7వ తరగతి వరకూ చదువుతన్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 5,420 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే 6, 7, 8, 9, 10వ తరగతి చదువుతున్న 1,290 మంది విద్యార్థులకు అందించేందుకు 13,280 నోట్ పుస్తకాలు ఎమ్మార్సీకి వచ్చాయన్నారు. ఇంకా మరిన్ని పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

నేడు మార్కండేయ స్వామి ఆలయంలో కల్యాణం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సీబీ రోడ్డులో ఉన్న మార్కండేయ స్వామి ఆలయంలో గురువారం భద్రావతి భావనా రుషీశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు బహుత్తమ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గద్దం గణేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేసేందుకు నిర్ణయించామన్నారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఒక్క రోజు మాత్రమే కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం సాయంత్రం 6:45 నిమిషాలకు స్వామి ప్రాకారోత్సవం చేపడుతామన్నారు.

ఉపాధి పనులకు హాజరుకండి

యల్లనూరు: మండల వ్యాప్తంగా ఉన్న ఉపాధి కూలీలు విరివిగా పనులకు హాజరు కావాలని ఏపీఓ షబ్బీర్‌బాషా సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది 7ఏ రిజిష్టర్‌లో వివరాలను తప్పక నమోదు చేయాలన్నారు. ఉపాధి రిజిష్టర్లు జాగ్రత్తగా భద్రపరుచు కోవాలని ఆదేశించారు. టీఏలు విధిగా మస్టర్లను తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో టీఏలు ప్రతాప్, అదిల్, శ్రీనివాసులు, జయరాం, శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోండి


భోజనం తయారీపై సూచనలిస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం (ఎండీఎం) నిర్వాహకులు భోజనం తయారు చేసే సమయంలో పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ఎంఈఓలు నవీద, లింగా నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎండీఎం నిర్వాహకులకు ఆహారం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మధ్యాహ్నం భోజనం తయారు సమయంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వంట మనుషులు, హెల్పర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కోచ్ జాకబ్ మృతి



గుత్తి: పట్టణంలోని తురకపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న ప్రముఖ క్రీడాకారుడు కమ్ కోచ్ జాకబ్ (65) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. గత కొన్ని రోజులుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న జాకబ్ తుదిశ్వాస విడిచారు. జాకబ్ ఫుట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, ఖోఖో, సాఫ్ట్‌బాల్, క్రికెట్‌లో నిష్ణాతులు. ఫుట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో కోచ్‌గా పని చేశారు. జాకబ్ మృతిపై ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకరం గోవిందరాజులు, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్ స్వామి, ఇస్మాయిల్, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు నాగిరెడ్డి, కొలంబస్, కార్యదర్శి శ్రీధర్ గౌడ్ తదితరులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

15 మంది బైండోవర్

పామిడి: జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చేటుచేసుకోకుండా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 15 మందిని బుధవారం పోలీసులు బైండోవర్ చేశారు. సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐ బెస్తరాజు ఆధ్వర్యంలో 15 మందిని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఎదుట హాజరుపరిచారు. గ్రామాల్లో గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవత పార్శిల్ సర్వీస్ వ్యాన్‌లో మంటలు


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

గార్లదిన్నె: మండల పరిధిలోని ఎగువపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం నవత పార్శిల్ సర్వీస్ వ్యాన్‌లో మంటలు వ్యాపించాయి. నవత పార్శిల్ సర్వీస్ వ్యాన్ వివిధ రకాల పార్శిల్ వస్తువులతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరింది. ఎగువపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారి వద్దకు చేరుకోగానే వ్యాన్ లోపల నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. పొగలు వస్తుండటంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వ్యాన్‌ను రోడ్డు ప్రక్కన ఆపేశాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. అనంతపురము నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ సిబ్బంది నీరు చల్లి మంటలను అదుపు చేశారు. వ్యాన్ లోపల వివిధ రకాల పార్శిల్ వస్తువులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

పెద్దవడుగూరు: మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌డీఓ సి.ఓబులమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. గతంలో విరుపాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన అశ్వర్థరెడ్డి అక్రమాలకు పాల్పడినట్లు అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయడానికి గతంలో పని చేసిన అధికారులతో డీఎల్‌డీఓ సి.ఓబులమ్మ సమావేశం అయ్యారు. గతంలో జరిగిన అవకతవకలపై విచారణ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపికృష్ణ ఈఓఆర్‌డీ శివాజీరెడ్డి, నాగేశ్వర శాస్త్రి, పలువురు అధికారులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ సి.ఓబులమ్మ

కూలీల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సావిత్రి

యాడికి: ఉపాధి కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో టీఏ, ఎఫ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..
జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధిహామీ పనులు కల్పించాలన్నారు. రోజు రూ.250 పైగా కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు చేసేటట్లు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనుల వద్ద ఎండ వేడిమిని తట్టుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పనులు చేస్తున్నప్పుడు కూలీలు గాయపడితే ప్రథమ చికిత్స చేసేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను పని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు

గార్లదిన్నె: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కనంపల్లి, ఇల్లూరు, కల్లూరులో ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఒకరిపై ఒకరు గొడవలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెద్దపప్పూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామమైన పెద్దయక్కలూరు, చీమలవాగుపల్లిలో ఇరుపార్టీల నాయకుల ఇళ్లలో బుధవారం యాడికి సర్కిల్ సీఐ రోషన్, ఎస్‌ఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత టపాసులు కాల్చడం, ఊరేగింపులు చేయడం లాంటివి చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుట్లూరు: సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమరాలతో నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. బుధవారం మండలంలోని గరుగుచింతలపల్లి, కోమటికుంట్ల తదితర గ్రామాల్లో సీసీ కెమరాలను ఏర్పాటు చేశారు. డ్రోన్ ద్వారా నిఘాను పరిశీలించారు. ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం బాణాసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం చేయరాదని హెచ్చరించారు.

బుక్కరాయసముద్రం: జూన్ 4వ తేదీన గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉండాలని బీకేఎస్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో ఆటోల ద్వారా 144 సెక్షన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల కౌటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రజలు నిబంధనలు పాటించాలన్నారు.


ఇల్లూరులో మాట్లాడుతున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్

తాడిపత్రి అర్బన్: ప్రజల్లో ధైర్యం నింపేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని తాడిపత్రి డీఎస్పీ కె.జనార్దన్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పుట్లూరు రోడ్డు, క్రిష్టాపురం రోడ్డు, టైలర్స్‌కాలనీ, జయనగర్ కాలనీ, యల్లనూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు, ఏపీఎస్పీ ఫోర్సు సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

గుత్తి రూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఐ నబిరసూల్ హెచ్చరించారు. మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో బుధవారం సీఐ, ఎస్‌ఐ, పోలీసు గ్రామంలో పర్యటించారు. గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలు ఇచ్చారు. విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా పేల్చడంపై నిషేధం ఉందని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

పెద్దవడుగూరు: ప్రజలందరూ శాంతియుతం గా జీవించాలని యాడికి సర్కిల్ సీఐ రోషన్, ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫర్టిలైజర్స్ షాపుల ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీస్తున్న ఏఓ డీ లీనా వసుంధర

పామిడి: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ షాపులతో పాటు సంకల్ప స్టోర్‌ను బుధవారం మండల వ్యవసాయాధికారిణి డీ లీనా వసుంధర ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంజునాథ్, షిర్డిసాయి ఫర్టిలైజర్స్ షాపులను, సంకల్ప్ స్టోర్‌లోని రికార్డులను పరిశీలించారు. సంకల్ప్ స్టోర్‌లో పత్తి విత్తనాలు ధర్మాగోల్డ్ ప్లాటినం, గాయత్రిగోల్డ్ రకాలు బీజీ–2 స్టాక్‌బుక్‌లో సరిగా నమోదు చేయలేదు. రైతులకు సంతకాలతో కూడిన బిల్లులను వేయక పోవడంతో ఆ స్టోర్‌లో విక్రయాలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా నాణ్యతా ప్రమాణాలు లోపించిన విత్తనాలను విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

తాడిపత్రి అర్బన్: తాడిపత్రికి చెందిన ఓ క్రీడాకారుడు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. మహేందర్ రెడ్డి అండర్–14, 16, 19 క్రికెట్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచడంతో సీనియర్ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. జూన్ 3న వైఎస్సార్ జిల్లా కడపలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొననున్నాడు. మహేందర్ రెడ్డి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంతో ఏటీఎల్ లలితమ్మ, సీనియర్ కోచ్ సాదిక్‌వలి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గార్లదిన్నె: మండల పరిధిలోని కొప్పలకొండ పెన్నానది నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. కొప్పల కొండకు చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా పెన్నానది నుంచి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఇళ్లు త్వరగా నిర్మించుకోండి


ఇంటిని పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ

యాడికి: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండలంలోని పచ్చారుమేకలపల్లె, పిన్నేపల్లె రహదారిలోని జగనన్న కాలనీల్లో హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ, ఏఈ ప్రశాంత్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 603 మందికి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిలో 337 మంది ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారన్నారు. 200 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. మిగిలిన 137 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలవాలని పూజలు


టెంకాయలు కొడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు

పామిడి: వైఎస్సార్‌సీపీ మళ్లీ గెలవాలని ఉరవకొండ మండలం పెన్నహోబిలంలోని లక్ష్మీ నరసింహ స్వామికి ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు పూజలు చేశారు. బుధవారం పెన్నహోబిలం వెళ్లిన ఆయన సీఎం వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి మరోసారి గెలవాలని స్వామికి 216 టెంకాయలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో నాగేష్ యాదవ్, నరేష్ యాదవ్, డాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న సీతారాముల కల్యాణం

పామిడి: పట్టణంలోని తలవాలకట్ట వీధిలోని కోట వరాంజనేయ స్వామి ఆలయంలో జూన్ 1వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. సీతారాముల కల్యాణం అనంతరం అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్వామి రథోత్సవం నిర్వహిస్తామన్నారు.

'మరణ ధ్రువీకరణ పత్రాలివ్వడంలో జాప్యం వద్దు'

గుంతకల్లుటౌన్: వివిధ రోగాల బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారి మరణ ధ్రువీకరణ పత్రాలివ్వడంలో జాప్యం చేయవద్దని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్దన్ రెడ్డిని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌ను బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బి.కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ తదితరులు కలిశారు. డెత్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఆస్పత్రి చుట్టూ తిప్పుకోవద్దన్నారు. సకాలంలో ఈ సర్టిఫికేట్లు అందని కారణంగా ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు, ఇతర బ్యాంకు లావాదేవీల్లో జాప్యం జరుగుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ కారణంగానే కొంత ఆలస్యమవుతుందని వైద్యులు తెలిపారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, బండి మురళి, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


బైక్‌ను ఢీకొన్న లారీ

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. అప్రమత్తమైన ద్విచక్ర వాహనదారుడు బైక్ నుంచి పక్కకు దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అదృష్టవశాత్తూ ప్రమాదం తప్పింది. స్థానికులు లారీ టైర్ల కింద ఇరుక్కున బైక్‌ను పక్కకు తీశారు. లారీ డ్రైవర్‌ను మందలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పరామర్శ


లక్ష్మీనారాయణరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల: ఇటీవల జంగంరెడ్డిపల్లిలో బోరు విషయంలో జరిగిన ఘర్షణలో గుండెపోటుతో రైతు లక్ష్మీనారాయణరెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడకండి.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. లక్ష్మీనారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు: మండల పరిధిలోని చిత్రచేడు గ్రామానికి చెందిన వివాహిత నాగవేణి బుధవారం విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన స్థానికులు ఆమెను పామిడికి తరలించి వైద్యం చేయించారు. కుటుంబ సమస్యలతో బాధపడుతున్న నాగవేణి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేసిందని పోలీసులు తెలిపారు.

దెబ్బతిన్న పండ్లతోటల పరిశీలన


కదవకల్లులో అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి శైలజ

పుట్లూరు: ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులందరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు నార్పల డివిజన్ ఉద్యానశాఖ అధికారిణి శైలజ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని కడవకల్లు, సంజీవపురం, దోశలేడు, చింతకుంట గ్రామాల్లో పర్యటించారు. రైతులు తాము సాగు చేసిన పంటలో 33 శాతం నష్టం జరిగి ఉంటే క్షేత్ర స్థాయిలో నష్టాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. పరిహారం కోసం సిఫార్సు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పంట నష్టాన్ని పరిశీలించి జాబితాను సిద్ధ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరం

పామిడి: పట్టణంలోని సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకూ ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరం నిర్వహించనున్నారు. జనసేన సొసైటీ ధర్మ హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపకుడు నరిశెట్టి ఆదిశేషు ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరామ్ సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆ సొసైటీ టీమ్ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారిని హాస్పిటల్‌కు తీసుకెళ్ళి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా శుక్లం ఆపరేషన్ ఉచితంగా చేయించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు. అలాగే ఆపరేషన్‌కు వచ్చే వారు 2 జతల బట్టలు, ఒక బెడ్‌షీట్ వెంట తెచ్చుకోవాలన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

పుట్లూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఏపీఓ చెన్నకేశవులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఈ పథకం కింద లబ్ధి పొందని వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. అలాగే పని ప్రదేశంలో లేని కూలీల పేర్లు మస్టర్లలో ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.